క్లుప్తంగా

11న జాతీయ విద్యా దినోత్సవం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 11వ తేదీన కేంద్ర తొలి విద్యా శాఖ మంత్రి, భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయిదా సబీహా పర్వీన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరువుతున్నారన్నారు. వేడుకలను విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 11వ తేదీన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు పని దొరక్క దయనీయ స్థితిలో ఉన్నారని, ఉచిత ఇసుక దొరక్కపోవడంతో కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మద్దయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి షూటింగ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 9, 10 తేదీల్లో బొల్లెద్దుల రామకృష్ణ స్మారక 7వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల విభాగంలో షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహకులు పరశురాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం నగరంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవసరమున్న ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉర్దూ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ 8వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.లోకనాథ తెలిపారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.షేక్షావలి ఖాన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో పాటు వర్సిటీ ఈసీ మెంబర్స్ హాజరవుతారని వెల్లడించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుబ్బలక్ష్మినగర్‌లో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే డెంగీ, చికున్ గున్యా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త యశోదమ్మ, జిలేఖబీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్): నందవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు రంగప్ప జిల్లా పంచాయతీ అధికారి జీ.భాస్కర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో దాదాపు 300 కుటుంబాలు నివశిస్తున్నాయని, గత ఐదేళ్లుగా తాగునీరు సరఫరా కాకపోవడం వల్ల ఉదయం 5 గంటలకే బస్టాండ్ వద్దకు వచ్చి నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కాలనీ బోరులో వచ్చే నీళ్లు దుర్వాసన, ఉప్పుగా ఉన్నాయని, ఈ నీటిని ఎలా తాగాలని ప్రశ్నించారు. జిల్లా అధికారులు సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో కాలనీవాసులతో కలిసి ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. నాయకులు సురేష్, మల్లేష్, కిషోర్ ఉన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందించండి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- నగరంలోని 61, 62వ సచివాలయాల తనిఖీ



61వ సచివాలయంలో ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (టౌన్): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సి.క్యాంపులోని 61, 62వ సచివాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది తక్కువగా ఉండటంతో ఇతర ఉద్యోగుల గురించి ఆరా తీశారు. వీఆర్‌ఓ బదిలీపై వెళ్లారని, శానిటరీ కార్యదర్శి సెలవులో ఉన్నారని, అలాగే బీఎల్‌ఓ సమావేశానికి వెళ్లారని అక్కడి సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో కలెక్టర్ అక్కడి నుంచే మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబుకు ఫోన్ చేసి ధ్రువీకరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు గడువు లోపు సేవలను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మెప్మా పీడీ నాగశివలీల ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేస్తాం

కర్నూలు (రూరల్): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం తప్పకుండా అందజేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు. కర్నూలు మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గార్గేయపురం గ్రామ సమీపాన చేపట్టిన 340సి నేషనల్ హైవే నిర్మాణంలో కోల్పోయిన భూముల పత్రాలను నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవితో కలిసి జేసీ పరిశీలించారు. బాధిత రైతులతో జేసీ మాట్లాడారు. మీ భూములు కోల్పోయింటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, న్యాయం చేస్తామని జేసీ హామీ ఇచ్చారు. అదేవిధంగా నేషనల్ హైవే నిర్మాణంలో సమీపంలో ఉన్న జగనన్న లే అవుట్‌లో బేస్‌మెంట్ నిర్మాణంలోని ప్లాట్లను కోల్పోతున్న వారికి ఆ ఖర్చు మొత్తాన్ని అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు మండల తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఉల్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ టీచర్ విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం డీఈఓ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్ పిల్లలను తరగతి గదిలో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి సైతం నీచంగా మాట్లాడుతున్నారని, కులం పేరుతో అవమాన పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై హెచ్ఎంకు ఫిర్యాదు చేస్తే, ఆయన కూడా అదేరీతిలో మాట్లాడుతున్నారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగప్ప, తదితరులు ఉన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఎస్‌జీఎఫ్ నాయకులు

కర్నూలు (టౌన్): కడప జిల్లా కమలాపురం పట్టణంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పోటీల్లో పాల్గొనే బాలబాలికలకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను అవకాశంగా మలచుకొని జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

రోగులతో మర్యాదగా నడుచుకోవాలి



ఆసుపత్రిలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులతో వైద్య సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన శుక్రవారం ఆసుపత్రిలోని ఎంసీహెచ్, గైనిక్, మహిళా ప్రాంగణం, శస్త్రుతభవన్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో వాటర్ లీకేజీ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. గైనిక్ విభాగంలో రోగులతో మాట్లాడి డెలివరీకి వచ్చే రోగులను త్వరగా చేర్చుకోవాలని ఆదేశించారు. హౌస్‌సర్జన్ క్వార్టర్స్ వద్ద ఉన్న వ్యర్థాలను తొలగించి శుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 విమలమ్మ ఉన్నారు.

మరణించి ఇద్దరికి కంటివెలుగు



నేత్రదాన ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని నాగేంద్రనగర్‌కు చెందిన ఎం.రామేశ్వరరెడ్డి తన మరణానంతరం నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా మానవ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎం.రామేశ్వరరెడ్డి కుటుంబసభ్యులు పెద్ద మనసుతో నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. వీరి వల్ల ఇద్దరికి కంటిచూపు వస్తుందని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే కోట్ల విజయభాస్కరరెడ్డి 'ఐ' డొనేషన్ రెడ్‌క్రాస్ వారు వచ్చి 15 నిమిషాల్లో కార్నియాను సేకరించినట్లు చెప్పారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బాడీ ఫ్రీజర్ బాక్స్, శాంతిరథం ఏర్పాటు చేసి అంత్యక్రియలకు సహకరించారు. మానవత ప్రోగ్రాం కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్‌శెట్టి, న్యాయవాది నాగమల్లీశ్వర్‌రెడ్డి, ఆత్మీయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, పట్టణ కార్యదర్శి నాగెళ్ల హరికిషన్ పాల్గొన్నారు.

లాన్‌టెన్నిస్‌లో జిల్లాకు వెండి పతకం



క్రీడాకారుడు సాయిశంకర్‌ను అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

కర్నూలు (టౌన్): కాకినాడ పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 విభాగంలో నిర్వహించిన లాన్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు క్రీడాకారుడు డి.సాయి శంకర్ వెండి పతకం సాధించారు. పతక విజేతను శుక్రవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో శామ్యూల్ పాల్ అభినందించారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు పరమేష్, సుంకారావు ఉన్నారు.

త్రోబాల్ పోటీల్లో ప్రతిభ



ట్రోఫీతో విజ్ఞానపీఠం క్రీడాకారిణులు

కర్నూలు (టౌన్): నంద్యాల పట్టణంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి 8వ స్మారక జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో నగర శివారులోని విజ్ఞానపీఠం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. తృతీయ స్థానంలో నిలిచి కప్పు అందుకున్నారు. ఇదే పోటీల్లో బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులను విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహ సేవా ప్రముఖ్, కరెస్పాండెంట్ గురుమూర్తి, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మాళిగి వ్యాసరాజు అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

తైక్వాండోలో రాణించాలి

తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో విద్యార్థినీ, విద్యార్థులు రాణించాలని కేశవ రెడ్డి విద్యాసంస్థల చైర్మన్ ఎస్.కేశవ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో తైక్వాండో క్రీడాంశంలో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయాలన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టును అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశరాముడు ప్రకటించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రస్ పంపిణీ చేశారు. పోటీలకు ఎంపికై న వారిలో అభిషేక్, సతీష్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, కర్నూలు) మహేష్ (ఆశ్రమ పాఠశాల, కర్నూలు), భరత్, సూరి, సంతోష్ (ఆదర్శ జూనియర్ కళాశాల, కర్నూలు) ఇస్మాయిల్ (ఎమ్మిగనూరు), అంజి నాయక్, చరణ్, జాషువా (అంబేడ్కర్ జూనియర్ కళాశాల, సి.బెళగల్) ఉన్నారు.

సకాలంలో వైద్యం అందించి మాతృ మరణాలు తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): సకాలంలో వైద్యమందేటట్లు చేసి మాతృమరణాలు తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాతృమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సెప్టెంబర్‌లో సంభవించిన మాతృమరణంపై సమీక్ష జరిపారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భిణులు తొందరగా ప్రమాదకర పరిస్థితిని గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. ప్రతి నెలా 9వ తేదీ జరిగే ప్రధాన మంత్రి మాతృవందన యోజన అనే కార్యక్రమాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలని చెప్పారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించినట్లయితే మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. సమావేశంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమరనాథ్, డాక్టర్ వెంకటనారాయణ, డాక్టర్ సుగుణ, డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ వై. శ్రీధర్, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు శిబిరాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక నూతన కౌన్సిల్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు ఫారం -6, ఓటు తొలగింపు ఫారం–7 వివరాల మార్పునకు ఫారం–8 దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతిఒక్కరూ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. కర్నూలు తహసీల్దార్ వెంకటలక్ష్మీ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాషా, వాజిద్ పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతులు పూర్తిచేయండి



ఐదు రోడ్ల కూడలిలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగరంలో పైపులైన్ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగర మేయర్ బీవై రామయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐదు రోడ్ల కూడలిలో జరుగుతున్న పైపులైన్ మరమ్మతు పనులను మేయర్ పరిశీలించారు. రెండు రోజుల క్రితం తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో విఠల్ నగర్, విద్యానగర్, గాంధీనగర్, మేడం కాంపౌండ్, నంద్యాల గేట్ ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పనులను పరిశీలించిన మేయర్ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈఈ మనోహర్ రెడ్డి ఉన్నారు.

ఇసుక దందాకు పాల్పడితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్



ఇసుక రీచ్‌లో టాస్క్‌ఫోర్స్ బృందంతో మాట్లాడుతున్న డీడీ రవిచంద్

కర్నూలు న్యూసిటీ: సొంత గృహ నిర్మాణం ముసుగులో ఇసుకను తరలించి అధిక ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా గనులు భూగర్భ ఖనిజాల శాఖ ఉప సంచాలకులు రవిచంద్ హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపుపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనంపై ఆయన స్పందించారు. కోడుమూరు మండలం గోరంట్ల, గొనెగండ్ల మండలం లింగందిన్నె గ్రామాలలో శుక్రవారం ఇసుక అక్రమ తరలింపుపై మైనింగ్ డీడీ తనిఖీలు చేపట్టారు. మండల టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఇసుకను తరలించే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ బృందం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యురేనియం తవ్వకాలపై స్పందించాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా దేవనకొండ మండల పరిధిలో యురేనియం తవ్వకాలపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని గోకారి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ యురేనియం తవ్వకాలు ఆపాలని పోరాటం చేసిందన్నారు. అధికారంలోకి రాగానే మాట మార్చి యురేనియం తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం అన్యాయమన్నారు. యురేనియం తవ్వకాలు జరిపితే కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు సమీపంలోని 15 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని యురేనియం తవ్వకాలను ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.భాస్కర్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- వలంటీర్లపై పోలీసుల జులుం బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): అక్రమ అరెస్టులతో వలంటీర్ల ఉద్యమాన్ని ఆపలేరని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం విజయవాడలో జరిగే వలంటీర్ల సదస్సుకు జిల్లా నుంచి వలెంటీర్లెవరూ వెళ్లకుండా పోలీసులు శుక్రవారం ఉదయం నుంచే నోటీసులు ఇవ్వడం, అదుపులోకి తీసుకోవడం, గృహ నిర్బంధం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబునాయుడు, లోకేష్ అక్రమ అరెస్టులపై సూక్తులు చెప్పి నేడు అదే పనిచేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసన్న, శ్రీరాములు, హనుమేష్, ఉపేంద్ర, సోమన్న పాల్గొన్నారు.

ఆర్‌యూ ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల ఘనత



పెరేడ్‌కు ఎంపికైన వలంటీర్లతో వర్సిటీ వీసీ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు

కర్నూలు కల్చరల్: వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్‌క్యాంప్‌కు రాయలసీమ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకానికి చెందిన వలంటీర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు వర్సిటీలోని వీసీ ఛాంబర్‌లో క్యాంప్‌కు ఎంపికై న కర్నూలు సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఏకే హర్షవర్ధన్, సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాల (ఆత్మకూరు రోడ్డు) విద్యార్థిని వి.కల్యాణిని వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ.. పెరేడ్‌లో చక్కని ప్రతిభ కనబరిచి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ.. ఇద్దరు వలంటీర్లు మహారాష్ట్రలోని కేబీసీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే పరేడ్ క్యాంప్‌కు హాజరవుతున్నట్లు తెలిపారు. పెరేడ్‌కి ఎంపికై న వలంటీర్లను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడుతో పాటు వర్సిటీ అధికారులు అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలపై నిరసన



విద్యుత్ భవన్ ముందు లాంతర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కర్నూలు (న్యూసిటీ): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలపై రూ.వేల కోట్ల ఆర్థిక భారం మోపుతూ నడ్డి విరుస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని విద్యుత్ భవనం ముందు లాంతర్లు చేతపట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలపై రూ.17 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షులు షేక్ జిలాని బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నాయకులు రాంపుల్లయ్య యాదవ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఆయిల్, గ్యాస్ విభాగాల్లో పనిచేస్తున్న లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో... విజయవాడలో నిర్వహించనున్న లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కనీస వేతనం రూ.26 వేలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు.